# సంస్కారణలు

'శేషయ్యా?'

'ప్రభూ!'

'ఈ వేళ నా మనసులో ఏదో చెప్పరాని ఆవేదనగా వుంటుందోయ్—'

'ఒక సోడాకాయ తెప్పించమంటారా?'

'ఛ! సోడాకాయకీ మనసుకీ సంబంధమేమిటీ?'

'అలా అనబోకండి—మనసులోని ఆవేదనలకు కారణాలు సాధారణంగా భౌతికమైనవే అయివుంటాయి—'

'శేషయ్యా, చూడూ—?'

'———'

'తూర్పున ఆ కారుమబ్బులా కదిలిస్తూన్న దేమిటీ—శత్రుసైన్యాలా?'

'కాదండి—గొర్రెలమంద!'

'ఎన్ని గొర్రెలు! అవన్నీ గొర్రెలేనటోయ్!'

'చిత్తం!'

'మహాసముద్రంలా వుంది ఆ మంద!'

'చిత్తం—అలానే వుండి—గొర్రెజాతి చాలా అభివృద్ధిలో వుంది—'

'శేషయ్యా!'

'ప్రభూ!'

'నాకేదో దిగులుగా వుందోయ్—శత్రువులు గానీ వాటిని మనమీదకు దండెత్తించడం లేదు గదా?'

'మీకు అటువంటి భీతి కలలోకూడా వొద్దండి—అవన్నీ మన సంస్థానపు గొర్రెలే!'

'మన సంస్థానానికి చెందినవే?'

'చిత్తం! ముమ్మాటికీ!'

'మన సంస్థానంలో అన్ని గొర్రెలున్నాయా ?'

'ఉన్నాయండి. ప్రభువులవారి హయాంలో అవన్నీ దినదిన ప్రవర్ధమానంగా వుంటున్నాయండి—'

'ఇన్నాళ్లనుంచీ చెప్పేవు కాదేమోయి, మన సంస్థానంలో ఇన్ని గొర్రె లుంటాయంటే ?'

'చిత్తం! తమకు తెలియని విషయమా అని చెప్పటానికి సాహసించ లేదండి—'

'శేషయ్యా !'

'అయ్యా !'

'ఇకముందు ఇలాంటి ఉపేక్షలు పనికిరావు నావద్ద—'

'చిత్తం! ప్రభువులు ఏం చెయ్యమంటే అది చేస్తాను—'

'నేను చెప్పేకనా చెయ్యటం ?'

'పొరబాటేనండి — లెంపలు వేసుకుంటున్నా—ఇకనుంచి తమరు చెప్పక పూర్వమే తమ ఆంతర్యం గ్రహించుకుని మరీ ప్రవర్తిస్తూంటా నండి !'

'రైట్ !'

'మహాప్రసాదం!'

'ఇన్ని గొర్రెలు ! ఇన్ని గొర్రెలు ! రకరకాల గొర్రెలు, రంగురంగుల గొర్రెలు, బుల్లి గొర్రెలు పెద్దగొర్రెలు...ఇన్ని వుంటాయంటే ఇన్నాళ్లూ తెలియనేలేదు...'

'పొరబాటే చేశానండి !'

'చూడ ముచ్చటైన జంతువులు కాదటోయ్ ఈ గొర్రెలూ ?'

'అవునండి—చూడ ముచ్చటైనవే !'

'చూడూ, ఆ మంద వూరును సమీపిస్తూన్నట్టుగా వుంది—'

'అవునండి !'

'ఎంత రమ్యమైన దృశ్యం ! తీరుతీరుల జంతువులు, ఇంపైన నడక— ఒక్కటికూడా గుంపులోనుంచి తప్పించుకుని పోవటం లేదోయ్ !'

'చిత్తం! వాటి స్వభావమే అంతండి!'

'మన మనుషులకన్నా చాలా తెలివైనవిలా కనిపిస్తాయి—మన వెధవల్ని నలుగుర్ని అలాగ బారుతీరి నడవమంటే కాలుకుంటే వాడొకడూ, మడత కాలెత్తేసేవాడొకడూ, ఎవరూ చూడకండా పక్కసందుల్లోకి దాటుకుపోయేవాడొకడూ—ఛస్ !'

'అంతేనండి!'

'గొర్రెకి వున్నంత బుద్ధికూడా లేకపోతే వీళ్ళకి......!'

'అవునండి! అంతేనండి!'

'అవి చూడూ—ఎంత స్వేచ్ఛగా, ఎంత ఉత్సాహంగా, ఎంత హాయిగా సందులో పడి వస్తున్నాయో?'

'అవి అంతేనండి! మనుషులకి మల్లే తిరుగుబాటు చెయ్యవు!'

'శెభయ్యా!'

'అయ్యా!'

'ఈ గొర్రెలను చూస్తూన్న కొద్దీ వాటి కేదో చెయ్యాలని బుద్ధి పుడుతుందోయ్!'

'చిత్తం, ఏం చేద్దామండీ?'

'చూడూ, ఆ మందను తోలుకొచ్చే వాడితో వాడి నన్నింటినీ మన కోటలోనికి తోలమని చెప్పు?'

'చెబుతానండి—చెప్పిన పిమ్మట?'

'ఆ గొర్రెల నన్నిటినీ మనమే ఎంతో బాగా పెంచుకుందాం—ఇంత మంచి జంతువులను!'

'బాగానే వుందండి!'

'మన ఆస్థానంలో బలుస్తూండే కవులకన్నా పండితులకన్నా తీసి పోయా యేమిటవి!'